# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 17-12-2024** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం గుంటూరు జిల్లా మంగళగిరిలోని అఖిల భారత వైద్య విజ్ఞాన సంస్థ.. ఎయిమ్స్‌లో ఈరోజు జరిగే మొదటి స్నాతకోత్సవానికి రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు.**

2. **ఆంధ్రప్రదేశ్ జీవనాడి పోలవరం ప్రాజెక్టును 2026 అక్టోబరు నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు తెలిపారు.**

3. **తెలంగాణాలో మాజీ సర్పంచులకు 691 కోట్ల 93 లక్షల రూపాయల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని త్వరలో చెల్లిస్తామని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క వెల్లడించారు.**

4. **ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరాపతిలో మరో 24 వేల 276 కోట్ల రూపాయల విలువైన పనులు చేపట్టేందుకు రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ.. సీఆర్డీఏ అథారిటీ ఆమోదం తెలిపింది.**

5. **రాష్ట్రంలో నిర్మాణంలో ఉన్న జాతీయ రహదారులు, రైల్వే ప్రాజెక్టుల పనులన్నీ 2028 డిసెంబరు నాటికి పూర్తయ్యేలా ప్రణాళికలు రూపొందించాలని ఆంధ్రప్రదేశ్ రహదారులు, భవనాలశాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి అధికారులను ఆదేశించారు.**

==========================

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం గుంటూరు జిల్లా మంగళగిరిలోని అఖిల భారత వైద్య విజ్ఞాన సంస్థ.. ఎయిమ్స్ మొదటి స్నాతకోత్సవం ఈరోజు జరగనుంది. ఈ కార్యక్రమానికి రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. 49 మంది ఎంబీబీఎస్ విద్యార్థులకు డిగ్రీలు, పోస్టు డాక్టోరల్ సర్టిఫికెట్ కోర్సు పూర్తి చేసిన మరో నలుగురు విద్యార్థులకు రాష్ట్రపతి బంగారు పతకాలు అందించనున్నారు. గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ సహాయ మంత్రి ప్రతాప్ రావ్ గణపత్‌రావ్ జాదవ్, రాష్ట్ర మంత్రులు సత్యకుమార్ యాదవ్, నారా లోకేశ్ గౌరవ అతిథులుగా హాజరవుతారు. కాగా.. రాష్ట్రపతి పర్యటన నేపథ్యంలో ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తున్నామని కృష్ణాజిల్లా పోలీస్ సూపరింటెండెంట్ గంగాధరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈరోజు ఉదయం 5 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు భారీ వాహనాలన్నీ ప్రత్యామ్నాయ మార్గాల్లో వెళ్లాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

--------------------------

ఆంధ్రప్రదేశ్‌లో పర్యటన అనంతరం రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము శీతాకాల విడిది నిమిత్తం సికింద్రాబాద్ బొల్లారంలోని రాష్ట్రపతి నిలయానికి ఈ రోజు చేరుకుంటారు. ఈ నెల 21వ తేదీ వరకు ఇక్కడే ఉండనున్న ఆమె వివిధ కార్యక్రమాల్లో పాల్గొంటారు. రేపు రాష్ట్రపతి నిలయంలో పలు అభివృద్ధి పనులను ప్రారంభిస్తారు. ఈ నెల 20వ తేదీన రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధి బృందం, అధికారులు, పౌరులతో రాష్ట్రపతి 'ఎట్ హోం' నిర్వహిస్తారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ జీవనాడి పోలవరం ప్రాజెక్టును 2026 అక్టోబరు నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు తెలిపారు. 2025 డిసెంబర్ నాటికి డయాఫ్రం వాల్ పూర్తి కావాలని అధికారులను ఆదేశించారు. ఏలూరు జిల్లాలోని పోలవరం ప్రాజెక్టు వద్ద పలు నిర్మాణాలను నిన్న ఆయన పరిశీలించారు. ఆ తర్వాత రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, ఇతర అధికారులతో చంద్రబాబునాయుడు సమీక్ష నిర్వహించి, పోలవరం ప్రాజెక్టు పనుల షెడ్యూల్‌ను ప్రకటించారు. పోలవరం ప్రాజెక్టు వల్ల 7 లక్షల 20 వేల ఎకరాల కొత్త ఆయకట్టు అందుబాటులోకి వస్తుందని తెలిపారు. 28 లక్షల మందికి తాగునీరు, 960 మెగావాట్ల విద్యుదుత్పత్తి సాధ్యపడుతుందని ముఖ్యమంత్రి వివరిస్తూ..

**.....వాయిస్.... 35 సెకన్లు ....**

---------------------------

ఆంధ్రప్రదేశ్ మొత్తానికి సాగు, తాగునీటి భద్రతను కల్పించే గోదావరి–పెన్నా నదుల అనుసంధానానికి కేంద్ర ప్రభుత్వం సాయం చేయాలని ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులురెడ్డి కోరారు. లోక్‌సభలో బడ్జెట్ అనుబంధ పద్దులపై నిన్న జరిగిన చర్చలో ఆయన తెలుగుదేశం పార్టీ తరఫున మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వానికి సమగ్ర వస్తు సేవలు.. జీఎస్‌టీ వసూళ్లు భారీగా పెరిగినందున అందులో 75 శాతం భాగాన్ని రాష్ట్ర ప్రభుత్వాలకు పంపిణీ చేయాలని కోరారు. ఇదే చర్చలో అరకు పార్లమెంట్ సభ్యురాలు గుమ్మ తనూజా రాణి మాట్లాడుతూ... విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్‌కు కేంద్ర ప్రభుత్వం ఆర్థికసాయం చేయాలని కోరారు. కర్మాగారానికి కేప్టివ్ ఇనుప ఖనిజం గనులు కేటాయించాలని కోరారు. అధిక వడ్డీ రుణాలను తక్కువ వడ్డీ కిందకు మార్చాలని విజ్ఞప్తి చేశారు. అలాగే రుణాలను ఈక్విటీ కిందికి బదిలీ చేయాలని కోరారు.

---------------------------

తెలంగాణా రాష్ట్రంలో మాజీ సర్పంచులకు ఈ ఏడాది నవంబరు 1వ తేదీ నాటికి 691 కోట్ల 93 లక్షల రూపాయల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని త్వరలో చెల్లిస్తామని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క చెప్పారు. గ్రామ పంచాయతీలు, జిల్లా, మండల పరిషత్తులకు సంబంధించిన పెండింగ్ బిల్లులు.. పంచాయతీల్లో బీటీ రోడ్లపై శాసనసభలో నిన్న ప్రశ్నోత్తరాల సమయంలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానమిచ్చారు. గత ఫిబ్రవరిలో సర్పంచుల పదవీకాలం పూర్తయిందని, కులగణన నేపథ్యంలో ఎన్నికలు జరగలేదని తెలిపారు. మాజీ సర్పంచులకు 2014 నుంచి బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని మంత్రి సీతక్క వివరించారు.

---------------------------

తెలంగాణాలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం వార్షిక పరీక్షలు మార్చి 5వ తేదీ నుంచి ప్రారంభమవుతాయి. 6వ తేదీ నుంచి ద్వితీయ సంవత్సరం పరీక్షలు ప్రారంభమవుతాయి. ఈ మేరకు తెలంగాణ

ఇంటర్‌బోర్డు పరీక్షల షెడ్యూల్‌ను నిన్న విడుదల చేసింది. ప్రయోగ పరీక్షలు ఫిబ్రవరి 3వ తేదీ నుంచి 22 వరకు జరుగుతాయి. ప్రథమ సంవత్సరం విద్యార్థులకు జనవరి 29వ తేదీన నైతికత, మానవీయ విలువలు.. 30వ తేదీన పర్యావరణ విద్య పరీక్షలు నిర్వహిస్తామని బోర్డు కార్యదర్శి కృష్ణ ఆదిత్య తెలిపారు. గతేడాది నుంచి ఆంగ్లంపై ప్రాక్టికల్స్ ప్రవేశపెట్టిన నేపథ్యంలో మొదటి సంవత్సరం విద్యార్థులకు జనవరి 31వ తేదీన, రెండవ సంవత్సరం విద్యార్థులకు ఫిబ్రవరి 1వ తేదీన జరుగుతాయి. రాష్ట్రవ్యాప్తంగా ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరాలకు కలిపి సుమారు 9 లక్షల మంది పరీక్షలు రాయనున్నారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరాపతిలో మరో 24 వేల 276 కోట్ల రూపాయల విలువైన పనులు చేపట్టేందుకు రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ.. సీఆర్డీఏ అథారిటీ ఆమోదం తెలిపింది. రాజధానిలో ప్రధాన రహదారులు, రాజధాని నిర్మాణానికి భూములు ఇచ్చిన రైతులకు స్థలాలు కేటాయించిన ఎల్పీఎస్ లే అవుట్లలో శాసనసభ, హైకోర్టు, సచివాలయం, విభాగాధిపతుల కార్యాలయ భవనాల నిర్మాణాలకు సంబంధించిన ప్రతిపాదనలకు సచివాలయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన నిన్న జరిగిన 43వ సీఆర్డీఏ అథారిటీ సమావేశం ఆమోదం తెలిపింది. సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ మంత్రి పి.నారాయణ వెల్లడించారు. ఈ నెలాఖరులోగా టెండర్లు పిలుస్తామని తెలిపారు. రాజధానిలో మౌలిక వసతుల అభివృద్ధి, ప్రభుత్వ భవనాల నిర్మాణానికి మొత్తం 62 వేల కోట్ల రూపాయలు ఖర్చవుతుందని మంత్రి నారాయణ వివరిస్తూ..

**......వాయిస్ (34 సెకన్లు).....**

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో నిర్మాణంలో ఉన్న జాతీయ రహదారులు, రైల్వే ప్రాజెక్టుల పనులన్నీ 2028 డిసెంబరు నాటికి పూర్తయ్యేలా ప్రణాళికలు రూపొందించాలని రాష్ట్ర రహదారులు, భవనాలశాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. భూసేకరణ, అటవీ శాఖ అనుమతుల్లో జాప్యం ఉండకూడదని సూచించారు. జాతీయ రహదారులు, రైల్వే ప్రాజెక్టుల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి వివిధ శాఖలతో ఏర్పాటు చేసిన టాస్క్ ఫోర్స్ కమిటీ సమావేశం సచివాలయంలోని మంత్రి ఛాంబర్లో నిన్న జరిగింది. ఈ సందర్భంగా మంత్రి జనార్దన్ రెడ్డి మాట్లాడుతూ.. ఈ ప్రాజెక్టులపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రత్యేక దృష్టి సారించారని, అధికారులు ఆయా సమస్యల పరిష్కారానికి సమన్వయం చేసుకోవాలని ఆదేశించారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో రైతులు, రైతు ఉత్పత్తి సంఘాలకు 35శాతం రాయితీపై రాష్ట్ర గోదాములను అద్దెకు ఇవ్వాలని, గిట్టుబాటు ధర లభించే వరకు నిల్వ చేసుకునే అవకాశం కల్పించాలని వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు అధికారులను ఆదేశించారు. మెగా సీడ్స్ పార్కు ఏర్పాటుకు చర్యలు వేగవంతం చేయాలని సూచించారు.

====================